# 'నా పోలికే అయితే నీ దారి మార్చుకో!'

చుట్ట కాలుస్తూ వరండాలో వాలుకుర్చీలో కూర్చున్నారు శేషగిరిగారు. బొద్దుగా పెరిగి నెరిసిపోయినా, తెల్లగా పట్టుకుచ్చులా అందంగా మెరుస్తున్న మీసాలూ, తలపండిపోయినా, బొద్దుగా వున్న జుత్తూ, నుదుట కుంకుంబొట్టూ, తెల్లారేటప్పటికి స్నానం, పూజా ముగించుకుని న్యూస్ పేపర్ కోసం ఎదురుచూస్తూ కూర్చునేవారు. ఆ వీధిలో రెండు మూడు వార్తా పత్రికలు తెప్పించేది అతనొక్కరే. పేపర్లొచ్చిన కాస్సేపటికి అక్కడికి చేరుకుంటారు పక్కింటి వాసుదేవరావుగారూ, ఎదురింటి పూర్ణ చందర్ రావుగారూనూ. తలా ఒక పేపరూ తీసుకుని, పేపర్లలోని ప్రతీ అక్షరం చదివేసి, ఆ తరవాత ముగ్గురూ చర్చ ప్రారంభించేవారు. నేటి రాజకీయాలూ, సామాజిక వ్యవస్థ, లంచగొండితనం, అవినీతి, గూండాయిజం, అన్నీ చర్చాంశాలే.

శేషగిరి గారంటే అందరికీ చాలా గౌరవం. విజయనగరంలోని గాంధీ మున్సిపల్ స్కూల్లో హెడ్ మాస్టరుగా పనిచేసి రిటైరయ్యారాయన. మాట ఎంత నెమ్మదో మనసు అంత మంచిది. ఎవ్వరినీ నొప్పించకుండా మాట్లాడడం, అతని మాటలతో అందరినీ ఆకట్టుకోవడం, అతని ప్రత్యేకత. అందుకే ఇటు ఇరుగూ పొరుగూ, అటు శిష్యకోటీ అందరికీ అతను ఆరాధ్యుడే.

శేషగిరిగారికి నలుగురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూనూ. ఆరోజుల్లో అన్తే పిల్లలేగా! శేషగిరిరావు గారి పోలిక అతని పిల్లలెవ్వరికీ రాలేదు. స్వార్థం, డబ్బుమీద మోజూ, నలుగురు కొడుకులకీ వుంది. బడిపంతులే అయినా బడాయి జీవితం గడపకపోయినా, దమ్మిడీ ఆస్తిపాస్తులు లేకపోయినా, తన నెల జీవతంతోనూ, కొన్ని ప్రయివేట్ ట్యూషన్లతోనూ ఎలాగో ఇల్లు గడుపుతూ, కొడుకులని బాగా చదివించారు. అందరూ మంచి ఉద్యోగాలలోనే స్థిరపడ్డారు. పెద్దవాడు రంగనాథం ఇంజనీరు, ప్రభుత్వోద్యోగం. రెండోవాడు కేశవ్ ఎం.కాం. బ్యాంక్ ఆఫీసరు. మూడోవాడు ఎం.బి.ఏ. చేసి మంచి కంపెనీలోనే ఎం.డి.గా వున్నాడు. నాలుగోవాడు ఐ.ఎ.ఎస్. రాసి ర్యాంకు చాలక రైల్వేలో ఆఫీసరుగా చేరాడు. తలొకరూ తలొక ఇల్లూ కట్టుకున్నారు.

ఎవరి సంసారాలు వాళ్లవి. జీతాలు అందరికీ నాలుగు సంఖ్యలకి తక్కువ లేకుండా వున్నా, అందరూ సరిపోవడం లేదన్నమాటే. ఒకళ్లింట్లో కొత్త టి.వి. కొంటే మిగిలిన మూడిళ్లలోనూ అంతకంటే కొత్త మోడల్ టీ.వీ.లు కొనాల్సిందే. ఒకావిడ నెక్లెస్ చేయించుకుంటే, మరొకావిడ గాజులూ, ఇంకొకావిడ గొలుసూ వగైరాలు - ఇలా తోటి కోడళ్ల మధ్యన పోటీలు! నలుగురు కొడుకులూ కూడా ఇతరులను విమర్శించినా వారి వారి భార్యామణులను

మాత్రం పల్లెత్తుమాటనరు. వారి అదృష్టం ఆరడిపెట్టని ఆడపడుచులూ, పెత్తనం చెయ్యని అత్తమామలూ.

పెద్దకూతురు సీతాలక్ష్మిని పదోక్లాసు వరకు చదివించి, తనకి దూరపు బంధువైన కృష్ణమూర్తిగారి కొడుకు సుధీర్‌కిచ్చి పెళ్లిచేశారు శేషగిరి గారు. సుధీర్ బొంబాయిలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఆఫీసరు. వాళ్లు బాగానే వున్నారు. రెండో అమ్మాయి లావణ్యను బి.కాం దాకా చదివించారు. నిజానికి, శేషగిరి గారి కుటుంబాన్ని చూసి అందరూ మెచ్చుకుంటూన్న సమయంలో, లావణ్యకి విపరీతంగా 'డయాబిటీస్' వ్యాధి పట్టుకుంది. దానికి తోడు యాక్సిడెంటయి కుడిచెయ్యి విరిగిపోయింది. అనారోగ్యం, అవిటితనం - లావణ్య శేషగిరి దంపతులకు గుండెలమీది కుంపటయింది. ఆ దిగులుతోనే శేషగిరి గారి భార్య సుందరమ్మ మంచం పట్టింది. దాదాపు ఆర్నెల్ల వరకూ కొడుకులూ, కోడళ్ళూ వంతుల వారీన ఒచ్చి పనిచేశారు. ఆ తరవాత సుందరమ్మ అందరికీ భారమే. శేషగిరిగారి పరిస్థితి ఒక్కసారిగా తారుమారయింది. అప్పుడే రిటైర్‌మెంటు కూడా వచ్చింది. నాలుగు డబ్బులు చేతిలోకొచ్చాయిగనుక, వంటమనిషినీ, పనిమనిషినీ పెట్టారు శేషగిరిగారు. కానీ తనవారి కందరికీ దూరంగా, రెండో కూతురి పరిస్థితికి తట్టుకోలేని సుందరమ్మ ఒక శుభముహూర్తాన, తన దారిన తాను వెళ్లిపోయింది. ఇంక శేషగిరిగారికి తోడు లావణ్యా, లావణ్యకి తోడు శేషగిరిగారూ. రిటైరవడం వల్ల శిష్యుల సందడీ తగ్గిపోయింది. ఆర్థిక ఇబ్బందులవల్ల పేపర్లు కొనడమూ మానేశారు. దాంతో ఇరుగుపొరుగు వారి రాకపోకలూ తగ్గిపోయాయి. సుబ్రమణ్యం పేటలో రెండు గదుల పెంకుటింట్లో, శేషగిరిగారు లేని ధైర్యం తెచ్చుకుంటూ లావణ్యకోసం బతుకుతున్నారు.

* * *

అటువంటి శేషగిరిగారి జీవితంలో హఠాత్తుగా ప్రవేశించాడు. రాఘవరావు. రాఘవరావు విజయనగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు మాష్టారుగా వున్నా, తీరిక సమయాల్లో తన అన్నగారు లక్ష్మణరావుగారికి పొలం పన్లలో సహాయపడేవాడు. నిండైన విగ్రహం, స్ఫురద్రూపి, అన్నింటికీ మించి, మానవతామూర్తి. వాళ్ల వూళ్లో అందరూ అతణ్ణి 'దేవుడుబాబూ' అని పిలిచేవారు. ఒకసారి ఒక స్నేహితుడి ద్వారా శేషగిరితో పరిచయమైన రాఘవరావు మనసు ద్రవించిపోయింది. అప్పటికప్పుడే నిర్ణయం తీసుకున్నాడు లావణ్యని పెళ్లిచేసుకోవాలని. అది కలా నిజమా నమ్మలేకపోయారు శేషగిరిగారు. "సమ్‌టైమ్స్.. ట్రూత్ ఈజ్.. స్ట్రేంజర్.. దాన్.. ఫిక్షన్" అన్నట్టు వెంటనే రాఘవరావుగారి అన్నగారితో సంప్రదించి, లావణ్య పెళ్లి రాఘవరావుతో జరిపించారు శేషగిరిగారు. ఆరోజు ఊళ్లో వాళ్ల ప్రస్తావనగా లావణ్య అదృష్టం గురించీ, ఆమె పెళ్లి గురించీ. రాఘవరావు మంచితనాన్ని పొగడని వాళ్లు లేరు.

రోజులు గడుస్తున్నాయి. సంవత్సరం తిరగకుండా, పండంటి కొడుకుని కన్నది లావణ్య. చూసినవాళ్లందరూ 'శేషగిరిగారి పోలిక పుణికి పుచ్చుకున్నాడు. ఆయనంతటివాడు కావాలి' అన్నారు. శేషగిరిగారు ముద్దుగా 'తాతయ్య' అని పిలుచుకునేవారు. పేరు కూడా 'శేషగిరి' అని పెట్టడంతో బయట వాళ్లందరికీ 'గిరీష్', శేషగిరి గారికి మాత్రం తాతయ్య. ఒక్కొక్కసారి 'జూనియర్' అని పిలిచేవారు శేషగిరిగారు.

దురదృష్టం కొందరిని వదిలిపెట్టదు. వారి జీవితాలతో నిర్దాక్షిణ్యంగా ఆడుకుంటుంది. రాఘవరావు పొలం పనుల మీద సాలూరు వెళ్లాడు. ఆవూళ్లో మునిస్వామినాయుడుగారికీ, శివారెడ్డిగారికీ క్షణం పడదు. కారణం ఇద్దరూ పెద్దరైతులే, ఒకరిమీద ఒకరికి పోటీ! పైగా ఇద్దరి మధ్యా చిచ్చుపెడుతూ లాభాలు పొందే మధ్యవర్తులుంటారు గనుక, వాళ్ల పోటీలూ పగలూ నానాటికీ పెరుగుతాయే తప్ప తరగవు. వాళ్ల తగవుల వల్ల ఆ వూళ్లో వాళ్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఎవరు ఎప్పుడు ఎందుకు ఒకరిమీద ఒకరు దాడి చేసుకుంటారో ఎవరి తలలు బద్దలౌతాయో ఎవరికీ తెలీదు. నాయుడుగారికి రెడ్డిగారి పాలేరు రాముడంటే మహాకోపం. ఎలాగైనా వాణ్ణి తప్పిస్తే రెడ్డిగారు బలహీనుడైపోతారని అతని నమ్మకం. అప్పుడు తనే ఏకైక భూపతి ఆ వూర్లో. అందుకే ఆ రోజు ధాన్యపు గింజలకోసం శ్రీకాకుళం వెళ్తూన్న రాముణ్ణి దారికాచి చంపడానికి కిరాయి గూండాలను పెట్టారు నాయుడుగారు. తెల్లవారు ఝామున ఒంటెద్దు బండిలో వాగు దాటేటప్పుడు దారికాచి చంపడానికి సిద్ధమయ్యారు నాయుడుగారి మనుషులు.

అమావాస్య చీకటి రాత్రులు. తెలతెలవారుతూన్న చీకటి పూర్తిగా విచ్చుకోలేదు. ఒంటెద్దు బండిలోంచి దిగి పంపు దగ్గర నీళ్లు తాగడానికి దిడిన అతణ్ణి దుడ్డు కర్రలతో బాది తలపగలగొట్టేశారు దుండగులు. 'రామచంద్రా!' అంటూ విలవిల కొట్టుకుపోతున్న, రక్తపుమడుగులో పడివున్న అతణ్ణి తిరిగి చూశారు దుండగులు ఆ కంఠస్వరం విని.

"దొరా.. దేముడు బాబూ...మీరా? ఎంత పని జరిగిపోనాది బాబూ" అంటూ తలకొట్టుకుని ఏడుస్తూ కుప్పకూలిపోయాడు సింహాచలం. "నువ్వా సింహాచలం? నీకేం ద్రోహం చేశానని నన్ను చంపాలనుకున్నావు?" నెమ్మదిగా అడిగాడు రాఘవ.

"నిన్ను సంపాలని కాదు దేవుడు బాబూ... రెడ్డిగారి పాలేరు రామున్ని సంపమని పురమాయించాడు నాయుడుగోరు.. పాపిష్టోన్ని.. డబ్బుకాశపడి సరేనన్నాను బాబో.. అతడు సరిగ్గా ఈ టయానికే ఇటొత్తారని సెప్పేరు. ఒంటెద్దు బండి మీద. సీకట్లో మిమ్మల్ని పోల్చుకోలేక పోయాను బాబో.. నన్ను క్షమించు దొరా.... వానెల్లి ఇప్పుడే పోలీసోల్లకి

లొంగిపోతాను" అంటూ కళ్లుమూసిన రాఘవకేసి చూస్తూ గుండె బద్దలయ్యేలా రోదించాడు, ఆ చీకట్లో ఒంటరిగా సింహాచలం.

"ఒరేయ్.. నేను పోతున్నాను.. ఇంకెప్పుడూ ఎవర్నీ చంపడానికి ప్రయత్నించకు.. నువ్వు. ప్రాణం తియ్యగలవే గానీ, ప్రాణం.. పొయ్యలేవుగా!.. వెళ్లి శేషగిరిగారితో చెప్పు..." మాట రాలేదు ఇంక.. రాఘవ శరీరం మీదపడి కుమిలి కుమిలి ఏడ్చాడు సింహాచలం. ప్రాణాలను బిగపెట్టుకుని వెళ్లి జరిగినదంతా శేషగిరిగారికి చెప్పి, పోలీసులకి లొంగిపోయాడు సింహాచలం.

లావణ్య కొయ్యబారిపోయింది వార్త వినగానే. శేషగిరి గారు పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు. 'జూనియర్' మాత్రం ఉయ్యాల్లో హాయిగా బోసినవ్వులు నవ్వుతున్నాడు. జనాన్నీ, కోలాహలాన్నీ చూసి!! జనంతో ఇల్లు నిండిపోయింది క్షణంలో. తతంగం అంతా శాస్త్రోక్తంగా జరిగిపోయింది. ప్రభుత్వం పాతిక వేలిచ్చింది లావణ్యకి. సింహాచలానికి ఉరిశిక్ష, నాయుడిగారిమీద కేసూ వేసింది ప్రభుత్వం. కర్మకాండ కొచ్చిన వాళ్లంతా, ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోయారు. డబ్బుని జాగ్రత్తగా వాడుకోమంటూ, జాగ్రత్తలు చెప్పి, అయ్యగారినీ అమ్మగారినీ, బాబునీ జాగ్రత్తగా చూసుకోమని చెప్పి కొడుకులూ, కోడళ్లూ అయిన వాళ్లందరూ వెళ్లిపోయారు. మూగగా మిగిలిపోయారు శేషగిరిగారూ లావణ్యా వైకుంఠపాళీలో పెద్ద పాముచేత కరవబడి మళ్లీ యథాస్థానంలో కొచ్చే పావుల్లా. గుండె రాయిని చేసుకుని బండగా బతుకుతూ వచ్చారు శేషగిరిగారూ లావణ్యా. పంచప్రాణాలు శేషగిరి జూనియర్ మీదే పెట్టుకుని.

* * *

గిరీష్ పెద్దవాడయ్యాడు. అగ్రికల్చర్ బి.ఎస్సీ. చేసి 'లా' డిగ్రీలో గోల్డ్ మెడల్ తెచ్చుకున్నాడు. లావణ్య ముఖంలో ఆనందం చూడలేని దురదృష్టం ఆమెని గుండెల్లో పొడిచింది. ఈ దుర్భర జీవితానికి స్వస్తి చెప్పి మరో ప్రపంచానికి వెళ్లిపోయింది ఆమె. ముసలి గుండె బద్దలవ్వక, కన్నీరు ఇంకిపోగా, గుంటలు పడ్డ కళ్లకి తడి లేక, మూగగా మంచానికంటుకుపోయారు శేషగిరిగారు. 'తాతయ్య' జూనియర్ భవిష్యత్తును చూడాలన్నదొక్కటే అతని కోరిక.

"బాబూ.. తాతయ్యా.. ప్రాక్టీసు పెడతావా? చదువయి పోయిందిగా! అడిగారు శేషగిరిరావుగారు. "తాతయ్యా.. రాజమండ్రిలో నా ఫ్రెండు వాళ్ల నాన్నగారు నాలుగెకరాల మాగాణీని అమ్ముదామనుకుంటున్నారట వాళ్లమ్మాయి పెళ్లికోసం. అది మనం కొంటే వ్యవసాయం చేద్దామనుకుంటున్నాను. నా డిగ్రీ కూడా అగ్రికల్చరల్ బి.ఎస్సీ. కదా!" అన్నాడు గిరీష్

"వీల్లేదు.. ఒద్దురా.. మనకా వ్యవసాయం గివసాయం ఒద్దు... 'లా' డిగ్రీలో గోల్డ్‌మెడల్ తెచ్చుకున్నావు. ప్రాక్టీసు పెట్టుకో!.. పొలం గిలం అనకు" ఇంచుమించుగా అరిచి చెప్పారు శేషగిరిగారు.

అతనెందుకలా ఉద్రేకపడుతున్నారో అర్థంకాని గిరిష్ ఆమాటే అడిగాడు. అంతవరకూ ఈ విషయాన్ని గుట్టుగా దాచిపెట్టారు శేషగిరిగారు. కుర్రవాడు పగ, పంతం అంటూ నాయుడు గారిమీద దండయాత్ర చేసినా, లేదా తండ్రి అడుగుజాడల్లో నడుస్తానన్నా ఆపలేడు కాబట్టి ఆ విషయాలేవీ అతడికి తెలీకుండా వుంచారు. వాళ్ల పెదనాన్నగారిస్తామన్న పొలానికి బదులు డబ్బు తీసుకుని గిరీష్‌ని చదివించాడు. ఎప్పుడూ ఎవ్వరూ తన తండ్రి ఈ విధంగా చంపబడ్డాడన్న వార్త అతనికి తెలీకుండా అందరి దగ్గరా మాటతీసుకున్నాడు. అందుకే, సాధ్యమయినంత వరకూ గిరీష్‌ని పట్నంలో హాస్టల్లోనే వుంచి చదివించారు.

మొట్టమొదటసారిగా తాతయ్య నోట ఈ కథంతా విని మూగబోయాడు గిరీష్. శేషగిరిగారి కంట్లోంచి మళ్లీ ఊటలా ఊరిన కన్నీళ్లను తుడుస్తూ "తాతయ్యా! నేను మీ మాటే వింటాను. మీరు చెప్పినట్టే చేస్తాను. దిగులుపడకండి తాతయ్యా..." అన్నాడు తాతయ్య చేతులు తన చేతిలోకి తీసుకుంటూ.

"నీకు నేను నిజంగా ఇష్టమయితే, నువ్వు నా పోలికే అయితే, నాదారి మార్చుకో!" అంటూ తృప్తిగా కళ్లు మూసుకున్నారు శేషగిరిగారు.

విజయనగరంలోని సుబ్రమణ్యం పేట రెండు గదుల పెంకుటింట్లో వసారాలో వాలుకుర్చీ పక్కగా నిలువెత్తు ఫోటో, ఎఱ్ఱగులాబీ దండతో అలంకరింపబడి వుంది. శిష్యులెందరో ఇప్పుడు పెద్దపెద్ద ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్లు, వాళ్ళ వాళ్ళ బిడ్డలతో సహా వచ్చి, ఫోటోకి నమస్కరించి పోతున్నారు. పక్కనే 'గిరీష్ అడ్వకేట్' బోర్డు పెట్టడంలో నిమగ్నమయ్యాడు గిరీష్, తాతయ్య కిచ్చిన మాట నిలబెట్టుకుంటూ!

* * *

అంకితం
భూమి తగాదాల్లో అన్యాయంగా
అసువులుబాసిన అమాయకులందరికీ.